బాలోత్సవంలో ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

కళ్యాణదుర్గం టిడిపిలో మూడు ముక్కలాట

◆ కొత్తగా రంగంలోకి 'అమిలినేని' ◆ శరవేగంగా సొంతింటి నిర్మాణ పనులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కళ్యాణదుర్గం టిడిపిలో మూడు ముక్కలాట మొదలవుతోంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తాజాగా ప్రముఖ కాంట్రాక్టర్, ఎస్‌ఆర్ కన్‌స్ట్రషన్స్ సంస్థ అధినేత అమిలినేని సురేంద్రబాబు రంగంలోకి దిగారు. టిడిపి టిక్కెట్టు వారికే ఖరారవు తున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఇదే సమయంలో ఆయన కళ్యాణ దుర్గం పట్టణంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టడం బలాన్నిస్తోంది. దీంతో ఈ నియోజకవర్గంలో మూడు అధికారిక కేంద్రాలు టిడిపిలో వెలిసినట్టవుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు అంతకు మునుపున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కాదని ఉమామహేశ్వర నాయుడుకి టిక్కెట్టు ఇచ్చారు. అయితే టిక్కెట్టు మార్పు జరగడంతో హనుంతరాయచౌదరి సహకారం అందించలేదు. ఆ ఎన్నికల్లో టిడిపి ఓటమి చెందింది. తదనంతరం కూడా ఈ విభేదాలు కొనసాగుతూనే వచ్చాయి. అనేక సందర్భాల్లో రెండు గ్రూపుల మధ్య విభేదాలు బాహటంగానే కొనసాగుతూ వచ్చాయి. అనేక మార్లు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు అధిష్టానం ప్రయత్నించినా ఫలితం లేదు. ఇప్పటికీ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులే ఉన్నాయి. 2024 ఎన్నికల్లోనూ ఇద్దరు టిక్కెట్టు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రూపు విభేదాలు మధ్య మరో వ్యక్తిని అవకాశం కల్పిస్తారన్న చర్చ నడుస్తోంది. కొత్తవారికిచ్చి ఇద్దరి మధ్యనున్న గ్రూపు విభేదాలకు ఫుల్‌స్టాప్ పెడుతారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఈ క్రమంలోనే ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్చన్ అధినేత సురేంద్ర పేరు తెరపైకి వస్తోంది. ఈ నియోజకవర్గం బరిలో నిలిచేందుకు వారు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు తాజాగా ఇంటి నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అధిష్టానం నుంచి ఏదైనా సంకేతాలు అందాయా అన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. గతంలోనూ ఇదే రకంగా సురేంద్రబాబుకు టిక్కెట్టు ఖరారైనట్టు ప్రచారం నడించింది. 2014 ఎన్నికల సమయంలో అనంతపురం అర్బన్ టిక్కెట్టు ఖరారైందని, ఆయన అనుయాయులు సంబరాలు కూడా జరుపుకున్నారు. చివరి నిమిషంలో మార్పు జరిగి ప్రభాకర్ చౌదరికి కేటాయించారు. దీంతో ఆయన అనుయాయుల్లో తీవ్రమైన నిరాశ ఎదురైంది. 2019లోనూ ఆశించినప్పటికీ అధిష్టానం టిక్కెట్టు ఖరారు చేయలేదు. ఇప్పుడు మరోమారు ఆయన పేరు తెరపైకి వస్తోంది. అయితే పార్టీ నుంచి అటువంటి సంకేతాలొచ్చాయా.. లేదా.. అన్నది మాత్రం స్పష్టత లేదు. సురేంద్రబాబు ప్రతిసారీ టిక్కెట్టు ఖరారవుతున్నట్టు ప్రచారం జరగడం చివరి నిమిషంలో వాయిదా పడటం జరుగుతూ వస్తోంది. 2009 ఎన్నికల్లో నుంచి ఇదే రకంగా జరుగుతోంది. 2009 సంవత్సరంలో ప్రజారాజ్యాం పార్టీ టిక్కెట్టు ఆశించారు. అనంతపురం అర్బన్ టిక్కెట్టు ఖరారైనట్టు ప్రచారం నడిచి, చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురై ఆ పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి అధికారికంగా ఏ పార్టీలో చేరనప్పటికీ టిడిపికి అనుకూలంగా ఉంటూ వచ్చారు. ఇక్కడ కూడా ఎన్నికల ప్రతిసారీ పేరు వినిపించడం వాయిదా పడటం ఆనవాయితీగా మారింది.

ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ ఎం.గౌతమి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం నోడల్ అధికారులు, ఎఎల్‌ఎంటీలు వారికి కేటాయించిన విధులను నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సార్వత్రిక ఎన్నికల దష్ట్యా నోడల్ అధికారులు, ఎఎల్‌ఎంటీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నిదియాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనలను తూచాతప్పకుండా పాటించాలన్నారు. ఎఎల్‌ఎంటీలు పిఒ పుస్తకాన్ని ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ చదివాలన్నారు. అధికారులు ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలన్నారు. ఈవీఎంలను సరైనరీతిలో భద్రపరచాలన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలని, ఈ విషయమై సంబంధిత ఆర్వో, డీఎస్పీలతో రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల విధులపై ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ ముద్రణకు సంబంధించి ప్రింటర్స్‌ను గుర్తించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, డిటిసి వీర్రాజుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు ఇచ్చేంత వరకూ ఉద్యమం : సిఐటియు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

శ్రీరామిరెడ్డి తాగునీటి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

శ్రీరామిరెడ్డి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించేంత వరకూ ఉద్యమం ఆగదని సిఐటియు తాలూకా కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ హెచ్చరించారు. వేతనాలు చెల్లించాలని కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీతి పథకం కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారానికి రెండవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక పంపుహౌస్ వద్ద చేపట్టిన ఆందోళన చేపట్టారు. అయితే తాగునీరు సరఫరా చేయాలని స్థానిక వైసిపి నాయకులు దౌర్జన్యంగా మోటార్లు ఆన్ చేసే ప్రయత్నం చేశారు. దీంతో కార్మికులు అడ్డుకున్నారు. ఈనేపథ్యంలో వైసీపీ నాయకులు, కార్మికుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. పరిస్థితి ఉధృతంగా మారడంతో పోలీసులు చేరుకుని సర్దిచెప్పారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ నిత్యం పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వేధించడం మంచి ది కాదన్నారు. కార్మికుల బకాయి వేతనాలు చెల్లించేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వన్నూరుస్వామి, ఆనంద్, రామాంజనేయులు, వెంకటేశులు పాల్గొన్నారు.

'సిద్ధం' ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

రాప్తాడులో ఈనెల 18న సిఎం జగన్ నిర్వహించనున్న సిద్ధం సభ ఏర్పాట్లను ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డితోపాటు జిల్లా ఎమ్మెల్యే, నాయకులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సభాస్థలి, వాహనాల పార్కింగ్, సౌకర్యాలను పరిశీలించి స్థానిక నాయకులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి సిద్ధం సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ రఘురాం, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, శంకరనారాయణ, వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీమంత్రి నర్సేగౌడ్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఔరా.. అనిపించే(బా)లా..!

◆ 2వ రోజూ ఉత్సాహభరితంగా బాలోత్సవాలు

◆ పిల్లల ఆట,పాటలతో కనులవిందు

◆ చూపరులను కట్టిపడేసేలా ప్రదర్శనలు

◆ బాలోత్సవం నిర్వహణపై సర్వత్రా హర్షాతిరేకాలు



◆ అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు..!

◆ ఏకపాత్రాభినయంతో అలరించారు..!

◆ పాటలు, డ్యాన్సులతో అదరగొట్టారు.!

◆ చూడచక్కని అభినయంతో ఔరా అనిపించారు..!

◆ చిట్టి ప్రయోగాలతో గట్టివారిమని నిరూపించారు... !

◆ బాలోత్సవం వేదికగా చిన్నారులు 'అనంత' సందడితో చూపరులను సమ్మోహితులను చేశారు..!

బాలోత్సవంలో నాట్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చిన్నారుల 'అనంత' ప్రదర్శనలతో బాలోత్సవం చూపురులను కనువిందు చేస్తోంది. పిల్లల మోములో ఆనందం, తల్లిదండ్రుల కళ్లల్లో చెప్పలేనంత సంతోషంతో బాలోత్సవ ప్రాంగణం కళకళలాడింది. వేలాది మంది 'అనంత'భావిభారత విజ్ఞాన సంపన్నులు బాలోత్సవ వేదికల మీద సాక్షత్కరిస్తున్నారు. రంగం ఏదైనా ప్రతిభ చాటడమే మా ధ్యేయం అంటూ ముందుకు సాగుతున్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం 2వ రోజు జరిగిన అనంత బాలోత్సవాల్లో ఎందరో బాల మేధావులు వారి ప్రతిభను చాటారు. వారి తెలివితేటలను చూసి తమనుతాము మైమరచిపోని వారుండరంటే అతిశయోక్తి కాదేమో. రెట్టించిన ఉత్సాహంతో చిన్నారులు పట్టపగ్గాల్లేనంత సంతోషంతో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు అలుపూసొలుపు లేకుండా పోటాపోటీగా ప్రదర్శనలు చేశారు. అడకమిక్, కల్చరల్ పోటీల్లో వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి తెలితేటలతో అందరినీ ఆకట్టుకున్నారు. కల్చరల్ పోటీల్లో తమ ప్రదర్శనలతో అందరినీ ఆకర్శించారు. నృత్య ప్రదర్శనలు అందరినీ ఉర్రుతలూగించాయి. నాటిక ప్రదర్శనలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలు, లఘు నాటికలు క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, రైమ్స్ అలాపనలు తెలుగు, ఇంగ్లీషు, షార్టు ఫిల్మ్ విశ్లేషణలు జరిగాయి. ఇక అకడమిక్‌లో వార్త రచన, మ్యాప్, వకృత్వ పోటీలు, క్విజ్ తదితర విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొని ప్రతిభాను చాటి చెప్పారు. ఉత్సహబరిత వాతావరణంలో జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు నగరవాసులు అనేక మంది ఆర్ట్స్ కళాశాల మైదానంకు విచ్చేసి ఆసక్తిగా తిలకించారు. బాలోత్సవాల ప్రదర్శన, నిర్వహణ చాలా బాగుంది అంటూ అక్కడికొచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. పిల్లల్ని ప్రోత్సహించేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. డ్యాన్స్ మాస్టర్‌లు వన్నూర్, కత్తి విజయ్‌కుమార్, నాట్యాచార్యులు పట్నం శివ ప్రసాద్ ప్రదర్శనలు చేసి పిల్లల్లో ఉత్సాహాన్ని నింపారు.

వివిధ వేషధారణలో చిన్నారుల ప్రదర్శనలు

విజేతలకు అవార్డుల ప్రధానం

అనంత బాలోత్సవం పోటీల్లో విజేతలకు అతిథులు అవార్డులు అందజేశారు. అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు వి.కోటేశ్వరప్ప ఆహ్వానితులుగా వ్యవహరించగా అనంత బాలోత్సవ కమిటీ కోశాధికారి జిలాన్ అధ్యక్షతన ఛైర్ పర్సన్ షమీమ్ షఫీవుల్లా నేతృత్వంలో అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు, ఎడి క్రిష్ణయ్య, సూపరింటెండెంట్ ఆదినారాయణ, ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, విన్నర్స్ క్లబ్ శ్రీవల్లి, అనంత బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, కమిటీ సభ్యులు లింగమయ్య, కోటేశ్వరప్ప, గోవిందరాజులు, ఏజి.రాజమోహన్, ఓతురు పరమేష్, రామాంజినమ్మ, న్యాయ నిర్ణేతలు, రచయితలు, మేధావులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

భరతనాట్యం చేస్తున్న చిన్నారులు....

'మీ వెన్నంటే ఉంటాం' : నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

టిడిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని మీ వెన్నంటే ఉంటామని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా నిజం గెలవాలి అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు రోజులపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించిడానికి వచ్చిన నారా భువనేశ్వరికి టిడిపి నాయకులు పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుండి ఆమె ప్రత్యేక కాన్వాయ్ లో పుట్టపర్తి మండల పరిధిలోని గాజుల పల్లి గ్రామానికి బయలుదేరగా ఆమెకు మామిల్లకుట క్రాస్, కప్పల బండ ,పెడపల్లి, కొట్లపల్లి గ్రామంలో, మహిళలు పెద్ద సంఖ్యలో ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి పంచాయతీలోని గాజులపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త మునిమడుగు బావయ్య కుటుంబానికి భువనేశ్వరి పరామర్శించారు. అనంతరం బావయ్య కుటుంబ సభ్యులకు రూ.3లక్షల విలువైన చెక్కును అందజేశారు.

ఓబుళ దేవర చెరువు : మండల పరిధిలోని గాజుకుంట్లపల్లి గ్రామంలో టిడిపి కార్యకర్త మేకల రామచంద్రరావు కుటుంబానికి భువనేశ్వరి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.3లక్షల విలువైన చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి, బూదిలి ఓబుల్ రెడ్డి, షేక్ నిజాం, జిల్లా తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ ఆర్ఎంపీ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : నిజం గెలవాలి అనే పర్యటనలో భాగంగా పట్టణం రాజీవ్ గాంధీ 8 వ వార్డులో మృతిచెందిన టిడిపి యువ నాయకులు ప్రకాష్ కుటుంబాన్ని నారా భువనేశ్వరి మంగళవారం పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులకు మూడు లక్షల రూపాయల విలువైన చెక్కును అందజేశారు. అలాగే కదిరి నియోజకవర్గంలో పలు మండలాలలోని మృతిచెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబానికి మూడు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, తలుపుల, నంబులపూలకుంట మండలాలలోని పలు గ్రామాలలో పర్యటించారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న నారా భువనేశ్వరి

ధర్మవరం టౌన్ : నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ నగర్ లో గల శ్రీ మారుతీ రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపంలో బుధవారం మహిళా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో గల చేనేత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నట్టు వారు తెలిపారు.

14 నుంచి ఉద్యోగ, పెన్షనర్ల పోరాటం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌జిఓ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు రావాల్సిన ఆర్థిక బకాయిలు, పిఆర్‌సి అరియర్స్ తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా శాంతి పోరాటాలు చేయనున్నట్లు ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, పెన్షర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లా జేఏసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఉద్యోగ సంఘ నేతలతో జరిపిన చర్చలో ఖచ్చిమైన హామీలు రానందున ఉద్యోగులు, ఉపాధ్యాయులు 14న విధుల్లోనే నల్లబ్యాడ్జాలు ధరించి నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. తహాశీల్దార్‌లు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 15, 16 తేదీల్లో భోజన విరామంలో నిరసనలు, 17న తాలుకా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు, అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, అద్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పథకానికి నిధులు కేటాయించాలి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం నిర్వహణకు శాశ్వతంగా సరిపరడా నిధులు కేటాయించాలని, కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సిఐటియు నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు పిఎఫ్, చెల్లించాలన్నారు. కళ్యాణదుర్గం డివిజన్ కార్మికులకు 4 నెలల వేతనాలు, 15 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించి కార్మికుల సమ్మెను విరమింపజేయాలన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు : జెసి కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-ఉరవకొండ

అధికారులతో మాట్లాడుతున్న జెసి కేతన్‌గార్గ్

2024 సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందస్తు ఏర్పాట్లను చర్చించి, సంబంధిత అధికారులకు తగిన సలహాలు, సూచనలు జారీ చేశారు. అన్ని రకాల ఏర్పాట్లను ముందుగానే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఉరవకొండ కార్యాలయంలో ఎన్నికల నియోజకవర్గ నోడల్ అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఆర్‌ఒ శిరీషా, గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, తహాశీల్దార్ హరినాథ్, ఎంపిడిఒ అమృతరాజ్, తదితరులు పాల్గొన్నారు.

యువచైతన్య యాత్రకు బ్రహ్మరథం

జెసి ప్రభాకర్‌రెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువ చైతన్య యాత్రకు మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముచ్చుకోటలో భారీగా జనాన్ని చూసి పరవశించిన జెసి ప్రభాకర్‌రెడ్డి యువకులతో కలిసి చిందులు తొక్కారు. దారి పొడవునా ప్రజలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. దారి పొడవునా పూలు వెదజల్లుతూ 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ముచ్చుకోటలో ప్రారంభమైన యాత్ర వరదాయపల్లి, చిక్కేపల్లి, షేక్‌పల్లి, నారపురం, నామనాంపల్లి, తదితర గ్రామాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి, నాగార్జునరెడ్డి, యువ నాయకులు ముచ్చుకోట లోకనాథ్‌రెడ్డి, ముచ్చుకోట విష్ణువర్ధన్‌రెడ్డి, వరదాయపల్లి రమణ, చిక్కేపల్లి సాంబశివారెడ్డి, వీరారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

టిడిపి పరిశీలకులు గుర్రప్పనాయుడు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం.. శింగనమల అభ్యర్థిని ఎవరిని నియమించినా పని చేయాల్సిందేనని టిడిపి పరిశీలకులు గుర్రప్పనాయుడు పిలుపునిచ్చారు. నారా లోకేష్ చేపట్టిన శంఖారావానికి మద్దతుగా టిడిపి మండల కన్వీనర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల అభ్యర్థులను నిర్ణయిస్తారన్నారు. ఎవరో చెప్పిన మాటలు విని విభేదాలు సృష్టించుకోకుండా పార్టీకి పనిచేయాలన్నారు. కొంతమంది కావాలని పార్టీని చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అలాంటి వారి మాటలను పట్టించుకోకుండా అందరూ ఐకమత్యంతో సైకిల్ గుర్తుకి ఓటు వేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎం చేయడమే ప్రతి కార్యకర్త లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. సిఎం జగన్ రాష్ట్రంలో సైకోగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు, టు మెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి కాటప్పగారి రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు, దండు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శింగనమల : మండల పరిధిలోని తరిమెల నుంచి గార్లదిన్నెకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన ఇసుక ట్రాక్టర్లపై దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఇసుక రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మండల కేంద్రంలోని గొల్లవీధిలో జిల్లె లక్ష్మీనారాయణ మద్యాన్ని ఇంట్లో అక్రమంగా అమ్ముతున్నట్లు పక్కాగా అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బుక్కరాయసముద్రం : మండలంలోని చెన్నంపల్లి రోడ్డులో ఉన్న విజయనగర కొట్టాల గ్రామంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ సిఐ సాయిప్రసాద్ తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎస్.మాసూంబాషా ఆదేశాల మేరకు అక్రమంగా నిల్వ ఉంచిన 33 సంచుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.79,200 ఉంటుందన్నారు. వాహన యజమాని జి.పవన్‌కళ్యాణ్, డ్రైవర్ సాకే వీరప్పను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు టి.రాజశేఖర్, ఎం.నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఒ సుబ్బరాజు మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు వెంకటాద్రిపల్లి, శీర్పి, విరుపాపల్లి, కోనాపురం, గంగవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, సుబ్బారెడ్డి, సంగప్ప, శ్రీవాణి, ప్రేమకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన

పుట్లూరు : మండల పరిధిలోని సి.వెంగన్నపల్లి, నారాయణపల్లి, ఎస్.గూడూరు, కొండేపల్లి, తక్కల్లపల్లి, గాండ్లపాడు, పుట్లూరు తదితర పోలింగ్ కేంద్రాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీధర్, ఆర్ఐ క్రిష్టప్ప, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారుల వివక్ష తగదు

మాట్లాడుతున్న ముతవల్లి ఎం.వహీద్‌జుమా

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని పురాతన మస్తానయ్య వలి స్వామి దర్గాలో ముతవల్లిగా తనకు బాధ్యతలు అప్పగించినా జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు అలసత్వం, వివక్ష చూపుతున్నారని ఎం.వహీద్‌జుమా ఆరోపించారు. మంగళవారం స్థానిక మస్తాన్‌వలి స్వామి దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మస్థానయ్య స్వామి దర్గాకు చెందిన హుండీల ఆర్థిక లావాదేవీల విషయంలో 2014లో అప్పటి దర్గా పీఠాధిపతిని సస్పెండ్ చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని వక్ఫ్ బోర్డు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి 2017లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పీఠాధిపతి తొలగించారన్నారు. అనంతరం దర్గా నిర్వహణకు వక్ఫ్‌బోర్డు ఓ అధికారిని నియమించిందన్నారు. అయితే ఆ పీఠాధిపతి మరలా కోర్టును ఆశ్రయించగా పిటిషన్‌ను తిరస్కరించిందని గుర్తు చేశారు. అనంతరం వక్ఫ్ బోర్డు ముతవల్లి పోస్టులకు దర్గాకు చెందిన వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవాలని 2021లో నోటిఫికేషన్ ఇవ్వగా తనకు అవకాశం కల్పించారన్నారు. దీన్ని కూడా సవాల్ చేస్తూ సస్పెన్షన్‌కు గురైన పీఠాధిపతి కోర్టుకు వెళ్లగా 2022లో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అయినా వక్ఫ్ బోర్డు అధికారులు దర్గాను తనకు అప్పగించకుండా (ముతవల్లిగా) వక్ఫ్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.వహీద్,ఎం.అనీష్,మునాజర్, ఎం.అథిర్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్


వృద్ధులకు కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

బడుగు, బలహీన వర్గాలను మోసం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో దోపిడీ, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు కనిపిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అభివద్ధి శూన్యం అని చెప్పారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏపీనే అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి గుంతకల్లు పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, మాజీ వైస్ ఎంపిపి మోహన్‌దాస్, మాజీ సర్పంచి సుంకన్న, తెలుగు యువత నాయకుడు సుధాకర్ నాయుడు, నాయకులు గురునాథ, బాలరంగారెడ్డి, ఉమర్, ఆదినారాయణ, వెంకట శివుడు,మల్లికార్జున, ధనుంజయరెడ్డి, నారాయణరెడ్డి, ఓబులయ్య, శ్రీనివాసులు, గురుస్వామి, దేవేంద్ర, కెవి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభం


వంతెన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఎంపీ రంగయ్య

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

చిన్నపాటి వర్షాలు వస్తే నది దాటాలంటే అవస్థలు పడుతున్న పరిసర ప్రాంతాల ప్రజలకు వంతెన పూర్తితో చిరకాలవాంఛ తీరనట్లేనని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మండలంలోని చిట్టూరు సమీపంలో ఉన్న పెన్నానదిపై ఎంపీ నిధులు రూ. 3కోట్లతో నిర్మించిన వంతెనను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లనుంచి ఇక్కడి ప్రజలు ఈసమస్యతో ఇబ్బందులు పడుతున్నందున ఈప్రాంతానికి పాదయాత్రగా వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ని ఇక్కడి ప్రజలు వంతెన కావాలని కోరారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రస్తుతం ప్రభుత్వంలో నేరవేర్చారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వైకాపా ప్రభుత్వ నైజమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత వైసిదే అన్నారు. ఈవంతెనతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ శరభారెడ్డి, నాయకులు వెంకటస్వామిగౌడ్, శేషానందరెడ్డి, రామచంద్రారెడ్డి, జిల్లా అదికార ప్రతినిధి పాశం నాగరంగస్వామి, నాగరాజు, కృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొంగఓట్లు తొలగించాలని వినతి

ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆర్‌డిఒ రాణీసుష్మితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు మురళి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 300 దొంగఓట్లు నమోదయ్యాయన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా మూడు నెలలుగా సర్వే చేసి దొంగఓట్లను గర్తించామన్నారు. ప్రస్తుతం ఆధారాలతో సహా నివేదికను అందజేస్తున్నామని, వెంటనే ఆయా ఓట్లను తొలగించాలని కోరారు. ఇందులో ఆర్‌డిఒ స్పందిస్తూ ఆయా బిఎల్‌ఓలతో మాట్లాడి దొంగ ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెద్దవడుగూరు : పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని మంగళవారం మండలంలోని అప్పేచెర్ల గ్రామ సచివాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసిన రైతులు సకాలంలో వర్షాలు కురవకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శి రామేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సూర్యనారాయణరెడ్డి, వెంకటరాముడుయాదవ్, రంగస్వామి, రైతుసంఘం కార్యదర్శి ఆదినారాయణ, నారాయణస్వామి, అల్లావలి, లాలుబాషా, వెంకటరాముడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

బెలుగుప్ప : పంచమిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారులకు ఉచితంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ మారెన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువుల తల్లి సరస్వతీదేవి మాఘశుద్ధ పంచమి, పంచమి, వసంత పంచమి రోజు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తే మంచిది అనేది తల్లిదండ్రుల నమ్మకం అన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సరోజినీనాయుడుకు నివాళి

సరోజినీ నాయుడుకు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎపి రాష్ట్ర పెన్షనర్స్ తాలూకా భవనంలో చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు శామ్యూల్, నారాయణరెడ్డి, గోవిందు, నారాయణశెట్టి, నాగేశం, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'ఇంటింటికీ వైసిపి'

అనంతపురం : ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగరంలో చేపట్టిన 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా నగరంలోని 42వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. 'చెప్పింది ఖచ్చితంగా చేస్తాడు' అని సిఎం జగన్‌పై ప్రజల్లో నమ్మకం ఉందన్నారు. అయితే ప్రతిపక్షాలు లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వారి మాటలను నమ్మకుండా ప్రజలకు మంచి చేస్తున్న సిఎం జగన్‌ను మరోసారి సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు.

పార్టీ అభ్యున్నతికి ఐక్యతతో కృషి : ఎంపీ

కళ్యాణదుర్గం : పార్టీ అభివృద్ధికి ఐక్యతా భావంతో కృషి చేద్దామని ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం శెట్టూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆసరా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను నేరుగా ప్రజల వద్దకే తీసుకొచ్చారన్నారు. ఆయా పథకాలను చూసి త్వరలో సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి తిరిగి జగన్‌ను సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అయ్యర్లపల్లి మంజు, నాయకులు సోమనాథ్‌రెడ్డి, హనుమంతురాయుడు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిని అమలు చేయాలి

సజ్జలతో మాట్లాడుతున్న కోదండరామిరెడ్డి

ఉరవకొండ : ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బత్తుల కోదండరామిరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం ఉరవకొండలో విలేకరులతో విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే పిఆర్‌సిని ఇవ్వాలని, లేకుంటే 26శాతం ఐఆర్ మధ్యంతర భృతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. వీటితోపాటు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన సజ్జల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబుకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

కరపత్రాన్ని అతికిస్తున్న యుటిఎఫ్ నాయకులు

'ఓట్ ఫర్ ఓపీఎస్'

రాయదుర్గం : యుటిఎఫ్ రాయదుర్గం జోన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో 'ఓట్ ఫర్ ఓపిఎస్' పోస్టర్లను మంగళవారం అతికించారు. ఇందులో భాగంగా రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట మైదానం, రైల్వేస్టేషన్, వివిధ బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు దగ్గర యుటిఎఫ్ ప్రతినిధులు పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాయదుర్గం, గుమ్మగట్ట మండలాలకు చెందిన ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 'నారాయణ' ప్రభంజనం

అనంతపురం : జెఇఇ మెయిన్ తొలి విడత ఫలితాల్లో నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన శశికిరణ్ 99.89 శాతం, మేఘన 99.64 శాతం, అసీన్‌ఖాన్ 99.23 శాతం, నవదీప్ 99.8 శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తాచాటారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను, బోధనా సిబ్బందిని అనంతపురం నారాయణ కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, విజయం వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ రవిశంకర్‌రెడ్డి, శిఖామణి, హిమబిందు, లక్ష్మన్న, ఓబన్నగౌడ్, జయలక్ష్మి, శ్రీధర్‌బాబు, ఈశ్వరి, ఏజీఎంలు హరిప్రసాద్., కేశవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అభినందనలు తెలిపారు.

నిరుద్యోగులను దగాచేసిన సిఎం జగన్

కళ్యాణదుర్గం : డీఎస్సీ పేరుతో సీఎం జగన్ నిరుద్యోగ యువతను నమ్మించి వంచించాడని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పవన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను నిరసిస్తూ టిడిపి, జనసేన నాయకులతో కలిసి మంగళవారం పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ముందుగా సర్కిల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్సీ పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీకి రీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఓ రాణిసుష్మితకు వినతిపత్రం అందజేశారు.

ఆందోళన చేస్తున్న టిడిపి, జనసేన, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆనందరావుపేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని రాచేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఆనందరావుపేట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందరావుపేటలో దాదాపు పది రోజుల నుంచి తాగునీటి సమస్య నెలకొందన్నారు. తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, సర్పంచికి విన్నవించినా పట్టించుకునే నాథులే లేకుండా పోయారన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆనందరావుపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, ఆంజనేయులు, కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

పేదలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-నార్పల

పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపిడిఒ రాముడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 4వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అన్నారు. కార్పొరేటు వైద్యానికి దీటుగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, నార్పల ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు సాదియా, ప్రవీణ్‌కుమార్, శ్రీరాములు, మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, వైద్యసిబ్బంది ఆక్కులప్ప, మునిరెడ్డి, రాజేంద్ర, ఎర్రిస్వామి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

15న హామీల జీవోల సాధనకు నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నిరవధిక సమ్మెలో భాగంగా పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులతో జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులందరికీ రూ.21 వేల వేతనం, అవుట్ సోర్సింగ్ కార్మికుల పదేళ్ల సర్వీసింగ్ గుర్తించి, కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరేండర్ లీవ్ అమలు చేస్తూ, 12వ పిఆర్‌సి అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వీటితోపాటు అనేక హామీలు ఇచ్చారన్నారు. వాటి అమలుకు వెంటనే జీవోలు విడుదల చేయాలని, లేనిపక్షంలో తిరిగి ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

ఉరవకొండ : కీటకజనీత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, మలేరియా యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పర్యవేక్షక సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా లాంటి ఎన్నో వ్యాధులు వస్తున్నాయన్నారు. కావున దోమ పుట్టకుండా, దోమ కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, స్టాఫ్‌నర్స్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

మంచి,చెడుపై విద్యార్థులకు అవగాహన

పెద్దవడుగూరు : సమాజంలో విద్యార్థినులు మంచిచెడులను ఎలా గుర్తించాలనే విషయాలపై మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. చరవాణిల ద్వారా విద్యార్థినులు ఎక్కువగా మోసపోతున్నారన్నారు. అలాగే బాల్యవివాహాలతో జరిగే అనార్థాలను వివరించారు. అనంతరం ట్రాఫిక్, సత్ప్రవర్తన తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సదాశివ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహశీల్దార్, ఎంపిడిఒకు సన్మానం

తహశీల్దార్, ఎంపిడిఒను సన్మానిస్తున్న నాయకులు

పామిడి : నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపిడిఒ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు ఎద్దులపల్లి రామకృష్ణారెడ్డి, రామచంద్ర, శివారెడ్డి, సర్పంచులు నారాయణస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహా, మైనార్టీ నాయకులు రజాక్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కల సూరి, నక్కనారప్ప, కృష్ణారెడ్డి, సల్లు, బోర్ల పుల్లయ్య, సుంకన్న, ఉమేష్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో కిరణ్‌కుమార్‌కు ప్రథమ బహుమతి

అవార్డు అందుకుంటున్న కిరణ్‌కుమార్

శింగనమల : నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అనంత బాలోత్సవంలో చిత్రలేఖనంలో విద్యార్థి కిరణ్‌కుమార్ ప్రథమ బహుమతి సాధించారు. మండల పరిధిలోని సోదనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పేట కిరణ్‌కుమార్ బాలోత్సవంలో నిర్వహించిన చిత్రలేఖనంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. కిరణ్‌కుమార్ వేసిన డ్రాయింగ్‌కు ప్రథమ బహుమతి లభించింది. ప్రథమ బహుమతి సాధించిన కిరణ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సచివాలయాల్లో సిబ్బందిని నియమించాలని వినతి

ఎంపిడిఒకు విన్నవిస్తున్న సర్పంచి యోగేశ్వర్‌రెడ్డి

బొమ్మనహాల్ : మండల పరిధిలోని సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సర్పంచి యోగేశ్వరరెడ్డి కోరారు. ఈమేరకు ఎంపిడిఒ విజయమ్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్‌ఘట్ట గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ అధికారి, విఆర్ఒ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటితోపాటు బొమ్మనహాల్, నేమకల్లు, గోవిందవాడ గ్రామాల్లోని సచివాలయాల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సచివాలయ సిబ్బంది కొరత ఉండటంతో పలు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల దరఖాస్తులను అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం అవుతోందన్నారు. వెంటనే స్పందించి సచివాలయాలకు సిబ్బందిని నియమించాలని కోరారు.

అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందించాలి

అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు ఓ.పెద్దన్న

ఆత్మకూరు : అంగన్వాడీ సెంటర్లలో మహిళలు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు ఒ.పెద్దన్న సూచించారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు యాలేరు, పంపనూరు, ఒడ్డుపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పిల్లలు, బాలింతలకు ఇస్తున్న బాలామృతం, గుడ్లు, ఆహారం పాలు కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉండేందుకు చొరవ చూపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, పిల్లలకు మెనూ ప్రకారం అందజేయాలన్నారు.